సాక్షి
వరంగల్
గురువారం 1 జూన్ 2023



పదోన్నతుల సందడి!
పోలీస్‌శాఖలో పదోన్నతుల ప్రక్రియ మొదలైంది. ఎస్సైలను సీఐలుగా, సీఐలను డీఎస్పీలుగా పదోన్నతి కల్పించనున్నారు.
- 8లో▸



పదేళ్లలో వందేళ్ల ప్రగతి
తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన పదేళ్ల కాలంలో సీఎం కేసీఆర్ పాలనలో వందేళ్ల అభివృద్ధిని సాధించిందని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
$43^{0}/28^{0}$

వాతావరణం
జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉన్నప్పటికీ మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రిళ్లు ఉక్కపోత ఉంటుంది.

ప్రజలకు సూపర్ సేవలు..

మెరుగైన చికిత్సకు సకల సౌకర్యాలు

- దసరా నాటికి సీఎం కేసీఆర్ చేత వైద్యసేవల ప్రారంభానికి కసరత్తు
- ఈ ఏడాదిలో జనగామ, భూపాలపల్లి మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు
- వచ్చే ఏడాది ములుగు జిల్లాలో ఏర్పాటు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- టీహబ్, మెడికేర్ ఆస్పత్రి ప్రారంభం..
- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల పరిశీలన


కాకతీయ మెడికల్ కాలేజీలో అకడమిక్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు


మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య


సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అభివృద్ధి పనులను మ్యాప్ ద్వారా మంత్రికి వివరిస్తున్న అధికారులు.. పక్కన మంత్రి ఎర్రబెల్లి, చీఫ్ విప్, కలెక్టర్

సాక్షి, వరంగల్/ఎంజీఎం/హన్మకొండ చౌరస్తా/కాజీపేట రూరల్: ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తేవడానికి ఆస్పత్రి నిర్మాణ పనులు సాధ్యమైనంత వేగంగా పూర్తిచేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆర్ అండ్ బీ అధికారులు, ఎల్అండ్‌టీ కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి చేసుకున్న పది అంతస్తుల్లో వైద్య పరికరాల బిగింపునకు అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. వరంగల్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కాకతీయ మెడికల్ కాలేజీలో రూ.28.75 కోట్లలో నిర్మించిన అకడమిక్ హాల్, హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రూ.125 లక్షలతో నిర్మించిన తెలంగాణ డయాగ్నోస్టిక్స్ సెంటర్(టీహబ్), వరంగల్ హంటర్‌రోడ్డులోని ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. దసరా నాటికి 'సూపర్' సేవలను సీఎం కేసీఆర్‌తో ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం గతేడాదిలోనే ఎనిమిది మెడికల్ కాలేజీ భవనాలు పూర్తి చేసిందన్నారు. ఈ ఏడాదిలో జనగామ, భూపాలపల్లి జిల్లా మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు మొదలవుతాయని, ఇప్పటికే జనగామలో 51 మంది, భూపాలపల్లిలో 54 మంది ప్రొఫెసర్లను నియమించామని మంత్రి చెప్పారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతులు ఇప్పటికే వచ్చాయని దీంతో వరంగల్‌లోని కేఎంసీతో పాటు మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లిలో మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చినట్టిందని చెప్పారు. వచ్చేదాది ములుగులో కూడా ప్రారంభించేలా ఇప్పటినుంచే నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ఫాదర్ కొలంబో మెడికల్ కాలేజీలో 150 ఎంబీబీఎస్ అడ్మిషన్లు, అటాచ్‌గా ఉన్న మెడికేర్ ఆస్పత్రిలో 2,000 మందికి ఉద్యోగా లు, 500 పడకల ఆస్పత్రి సాకర్యంతో ఈ ప్రాంతమంతా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. మెడికేర్ ఆస్పత్రికి నర్సింగ్ కాలేజ్, బీఎస్సీ పారా మెడికల్ కాలేజీ, ఆరోగ్యశ్రీ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తాన ని చెప్పారు. కాగా.. వరంగల్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ దయాకర్, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు అరూరి రమేష్, గండ్ర వెంకటరమణారెడ్డి, టి.రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, మేయర్ గుండు సుధారాణి, డీఎంఈ రమేష్‌రెడ్డి, కలెక్టర్లు పి.ప్రావీణ్య, కలెక్టర్ సిక్తా పట్నాయక్, మున్సిపల్ కమిషన ర్ రిజ్వాన్ బాషా, కాళోజీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కరుణాకర్‌రెడ్డి, ఎల్ అండ్ టీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటరెడ్డి, బిషఫ్ ఉడుములబాల, మెడికల్ కాలేజీ డైరెక్టర్ టి.అగస్టిన్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ హెచ్.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- కార్యకర్తలకు అండగా ఉంటాం
- గొడవలు చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు
- కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా సమావేశంలో నేతలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి స్వర్ణ

వరంగల్: రానున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని పార్టీ వరంగల్ కమిటీ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలిగా నియమితులైన ఆమె బుధవారం వరంగల్ అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఎలాంటి ఆపద వచ్చినా తాను, వరదరాజేశ్వర్‌రావు అండగా ఉంటామన్నారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో పీసీసీ నుంచి ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యక్షురాలు, వరంగల్ పార్లమెంట్ పరిశీలకురాలు శోభారాణి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకుల అవినీతిని ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నా రు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు పత్రికల్లో విమర్శలు చేసుకుంటున్నాయే తప్ప తెరవెనక రెండూ ఒక్కటే అని అన్నారు. కాళేశ్వరం పేరిట బీఆర్ఎస్ పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడిందన్నారు. సమావేశంలో ఘర్షణకు పాల్పడిన వివరాలు పీసీసీ దృష్టికి తీసుకెళ్లేందు పరిశీలకురాలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో హనుమకొండ, సీనియర్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరద రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

కొండా వర్గీయుడిపై ఇనుగాల వర్గీయుల దాడి

- కానరాని కొండా దంపతులు
- డీసీసీ మీటింగ్‌కు తూర్పు శ్రేణుల గైర్హాజర్


దాడిని అడ్డుకుంటున్న వరద రాజేశ్వర్‌రావు

వరంగల్: వరంగల్ అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన డీసీసీ సమావేశంలో కొండా వర్గీయుడు గాడిపెల్లికి చెందిన సీనియర్ నాయకుడు కడిదెల కట్టస్వామిపై ఇనుగాల వర్గీయులు ధర్మారానికి చెందిన దుపాకి సంతోశ్‌తో సహా పలువురు దాడికి పాల్పడ్డారు. కార్యకర్తలు సమన్వయం పాటించాలని వేదికపై ఉన్న నాయకులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. సమావేశం నుంచి వెళ్తున్నప్పటికీ వెంటపడి దాడి చేయడంతో కట్టస్వామి షర్టు చినిగిపోయింది. అక్కడే ఉన్న వరదరాజేశ్వర్‌రావు అడ్డుకుని హెచ్చరించడంతో గొడవ సద్దుమణిగింది. తెలిసిన సమాచారం మేరకు గత కొద్ది రోజులుగా ఇనుగాల వాట్సాప్ గ్రూప్‌లో కొండా అభిమాని కట్టస్వామి పోస్టింగ్‌లు పెట్టడంపై దుపాకి సంతోశ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. సమావేశంలో కట్టస్వామి ఎదురుపడడంతో దుర్భాషలాడుతూ సంతోశ్ బృందం దాడికి పాల్పడినట్లు తెలిసింది.

సమావేశానికి తూర్పు నేతల గైర్హాజర్..
వరంగల్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం వరంగల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో తూర్పు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గైర్హాజర్ అయ్యారు. డీసీసీ పదవీ రేసులో ఉన్న కొండా వర్గీయులకు పదవి దక్కక పోవడంతో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కొండా సురేఖలతో పాటు వారి వర్గీయులు సమావేశానికి దూరంగా ఉన్నారు. తూర్పులో పార్టీ శ్రేణులు దాదాపు ఈసమావేశంలో కానరాకుండా పోయారు. ఎల్‌బీనగర్‌లో సమావేశం నిర్వహించినా మైనార్టీలు రాకపోవడం, కొండా వర్గీయులు కనిపించపోవడం చర్చనీయాంశంగా మారింది. వరంగల్ తూర్పు టిక్కెట్టు రేసులో ఎర్రబెల్లి స్వర్ణ ఉన్నందునే కోపంతో కొండా దంపతులు హాజరు కాలేదని చర్చ సాగింది.

న్యూస్‌రీల్

విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆందోళన

ఖానాపురం: మండలంలోని మంగళవారిపేటలో మూడ్రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మూడ్రోజుల క్రితం కురిసిన గాలివానకు గ్రామంలోని విద్యుత్‌లైన్ తెగిపోయింది. దీంతో విద్యుత్‌లైన్ మరమ్మతులకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అడ్డుకోవడంతో విద్యుత్ సరఫరా పునఃరుద్ధరణకు నోచుకోలేదు. దీంతో గ్రామానికి చెందిన పలువురు మహిళలు బుధవారం సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. సుమారు అరగంట ఆందోళన చేసి సబ్‌స్టేషన్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తామని హామీ ఇవ్వడంతో వెళ్లిపోయారు. అనంతరం విద్యుత్ అధికారులు గ్రామంలో మరమ్మతులు చేపట్టారు.

కేసు నమోదు చేయాలి



నర్సంపేట: ప్రేమించి పెళ్లి చేసుకున్న సుశ్రుత, దేవర్షల మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కేపీఎస్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గురుమిల్ల రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో మృతుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గన్నారం సరోజన, కొత్తపల్లి యుగంధర్, గాజర్ల చిన్న, గన్నారం భరత్, మౌనిక, దివ్య, బి.వరమ్మ, సదానందం, గాదర్ల అంకుశ్, కందికొండ మల్లికాంబ, గుగ్గిళ్ల లిసా, ఆద్య, విజయ, మాసని సమ్మక్క, గణిపాక ప్రశాంత్, సుంకరి రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



నర్సంపేట: అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ పశ్చిమ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వైద్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్టీయూ నాయకులు పాలడుగు రమేశ్, అంగన్‌వాడీ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రమాతార, ప్రధాన కార్యదర్శి శ్యామల, జిల్లా నాయకులు ప్రసన్న, రేణుక పాల్గొన్నారు.

రెండు తలల పాము లభ్యం!



నర్సంపేట రూరల్: నర్సంపేటలోని సర్వాపురం శివారులో రైతు బుర్ర వీరస్వామిగౌడ్ పొలంలో బుధవారం రెండు తలల పాము లభ్యమైంది. రైతు పొలం పనులు చేస్తుండగా.. రెండు తలల పాము కనిపించింది. వెంటనే అతడు పామును పట్టుకుని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఫారెస్ట్ అధికారులు పామును రైతు వద్ద నుంచి స్వాధీనం చేసుకుని పాకాల అడవిలో వదిలిపెట్టారు.

దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం



వర్ధన్నపేట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించేందుకు బుధవారం వర్ధన్నపేటతో పాటు పలు గ్రామాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. వర్ధన్నపేటలోని రైతు వేదిక, మున్సిపల్ కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వర్ధన్నపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అన్నమనేని అప్పారావు అధ్యక్షతన, నల్లబెల్లిలో రాంధతండా, ఉప్పరపల్లి, చెన్నారం గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులతో జెడ్పీటీసీ మార్గం భిక్షపతి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసమావేశాల్లో జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించే కార్యక్రమాలు, వాటి ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్ష జరిపారు.

పైసా పడలే!

1,211 మంది వద్ద ధాన్యం కొనుగోళ్లు

- యాభై శాతం ఆన్‌లైన్ పూర్తి
- నగదు కోసం రైతుల ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు


ప్రభుత్వ గోదాం వద్ద దిగుమతి అవుతున్న ధాన్యం బస్తాలు

ఖానాపురం: ఆరుగాలం కష్టించే రైతులకు ధాన్యం విక్రయించుకోవడానికి తిప్పలు తప్పట్లేదు. పంటలు సాగు చేయడం ఎంత కష్టమో.. పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవడం అంత కష్టమవుతోంది. అష్టకష్టాలు పడి ధాన్యాన్ని విక్రయిస్తే.. డబ్బులు ఖాతాల్లో జమవ్వక ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం డబ్బులు ఎప్పుడు విడుదల చేస్తుందో తెలియక ఆందోళనకు గురవుతున్నారు.

సకాలంలో డబ్బులివ్వాలి..
ఖానాపురం సొసైటీ ఆధ్వర్యంలో తొమ్మిది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా మే 13 నుంచే కొనుగోళ్లు ప్రారంభయ్యాయి. వీటి ద్వారా ఇప్పటి వరకు 1,79,900 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వీటన్నింటినీ ఆయా మిల్లులకు తరలించారు. కొన్ని దిగుమతులు ఇప్పటికే పూర్తి చేసుకోగా.. మరికొన్ని బస్తాలు గోదాంల వద్దే వాహనాల్లో బారులు తీరి ఉన్నాయి. హమాలీల సంఖ్య తక్కువగా ఉండడంతో దిగుమతులు సకాలంలో పూర్తి కావట్లేదు. 1,211 మంది రైతుల వద్ద రూ.14 కోట్ల 74లక్షల 94వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క రైతు ఖాతాలో డబ్బులు జమ కాకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాల్లో సుమారు 50 శాతం వరకు ఆన్‌లైన్ నమోదును సొసైటీలో పూర్తి చేశారు. ఆన్‌లైన్ పూర్తి చేసుకున్న రైతులకు సైతం డబ్బులు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రైతులకు సకాలంలో డబ్బులు పడేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు కోరుతున్నారు.

ఇంకా డబ్బులు పడలేదు..



నేను సాగు చేసుకున్న భూమి ద్వారా 700 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. వచ్చిన ధాన్యాన్ని మే15న సొసైటీలో విక్రయించాను. ఇప్పటి వరకు డబ్బులు ఖాతాలో జమ కాలేదు. డబ్బుల కోసం ఎదురుచూస్తున్నాం. అధికారులు స్పందించి జమ చేయించాలి.
– దేవినేని వేణుగోపాల్‌రావు, రైతు, ఖానాపురం

మిల్లర్ల నిరాకరణ

- తిరిగి కొనుగోలు కేంద్రానికి ధాన్యం
- ఆందోళనలో రైతులు


కొనుగోలు కేంద్రానికి చేరుకున్న వరిధాన్యం

రాయపర్తి: ఆరుగాలం శ్రమించి పండించిన వరిధాన్యాన్ని కాంటాలు వేసి మిల్లులకు తరలించినా ఫలితం లేకుండా పోయింది. మిల్లర్ల నిరాకరణకు గురైన వరిధాన్యం తిరిగి కొనుగోలు కేంద్రానికి తరలించిన ఘటన మండలంలోని తిర్మలాయపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. బాధిత రైతులు కొంక శ్రీనివాస్, వేణు, మల్లయ్య వివరాల ప్రకారం.. గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో 661 బస్తాలను కాంటా వేసి లారీల్లో మిల్లులకు తరలించారు. శ్రీనివాస్‌కు చెందిన 498 బస్తాలు, వేణుకు చెందిన 137 బస్తాలు, మల్లయ్యకు చెందిన 26 బస్తాలను వేబ్రిడ్జికి వేసి నక్కలపల్లి మిల్లులకు పంపించారు. తాలు, తేమ సైతం ఎదుర్కొని కాంటాలు వేసి వేబ్రిడ్జ్ వేయడంతోపాటు హమాలీ ఖర్చులు రూ.40 నుంచి రూ.45వేలు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని జాగ్రత్తలు పాటించి కొనుగోలు కేంద్రంలో కాంటాలు వేసి మిల్లులకు పంపిస్తే తిరిగి పంపించడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కాగా.. మిల్లర్లు ధాన్యాన్ని ఎందుకు తిరిగి పంపించారో కారణాలు తెలియాల్సి ఉంది.

మాకు న్యాయం చేయాలి..

ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని విక్రయించామని సంబరపడ్డాం. కానీ తిరిగి పంపించారు. కొనుగోలు కేంద్రంలో అన్ని ఖర్చులు మేమే భరించి విక్రయించాం. ప్రభుత్వాధికారులు న్యాయం చేయాలి.
– కొంక శ్రీనివాస్, రైతు తిర్మలాయపల్లి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పూజలు చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి, పాల్గొన్న గ్రామస్తులు

రాయపర్తి: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని మైలారంలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మరుగునపడిన ఆలయాలకు పునరుజ్జీవం చేయించినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఆలయాల అభివృద్ధిపై దృష్టి సారించి పాలకుర్తి మండలంలోని వల్మిడికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. భద్రాచలానికి ఉన్నంత చరిత్ర వల్మిడికి ఉందన్నారు. భాగవతం రాసిన పోతన, తొలి తెనుగు కవి పాల్కురికి సోమనాథుడి ఆలయ ప్రాంతాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

నియోజకవర్గంలోని గ్రామాల్లోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికిసైతం పాటుపడుతున్నట్లు చెప్పారు. మైలారం గ్రామంలో నిర్మితమైన సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో కల్యాణ మండపానికి రూ.20 లక్షలు, ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు, అర్చకుడు ఉండేందుకు నిర్మించే ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. ఈసందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఎంపీటీసీ గాడిపెల్లి వెంకన్న, ఉపసర్పంచ్ సారయ్య, గ్రామపార్టీ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, గబ్బెట బాబు, సంది బుచ్చిరెడ్డి, బొమ్మినేని రంగారెడ్డి, పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గూడెల్లి వెంకన్న, ఉల్లెంగుల నర్సయ్య, చందునాయక్, బాద యాకయ్య, బాద సుధాకర్, గబ్బెట లక్ష్మీయాకయ్య, రాములు, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు సంఘటితంగా ఉండాలి


సంఘం సభ్యత్వ నమోదు రశీదులు అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు

సంగెం: పద్మశాలీలు సంఘటితంగా ఉంటూ.. సామాజిక, విద్యా, ఆర్థిక, రాజకీయంగా ఎదగాలని వరంగల్ జిల్లా కన్వీనర్ శరత్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం సంగెం ఎంపీడీఓ కార్యాలయంలో పద్మశాలి సంఘం మండల సమావేశం నిర్వహించి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలి సంఘాన్ని రాష్ట్ర స్థాయిలో బలోపేతమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరహరి, నాయకులు చంద్రప్రకాశ్, సుదర్శన్, మనోహర్, సత్యనారాయణ ఉన్నారు.

కమిషనర్ తనిఖీలు

వరంగల్ అర్బన్: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, డివైడర్ల వెంట మొక్కల పెంపకం, నల్లాల నుంచి నీటి సరఫరా తీరుపై గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా బుధవారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ రోడ్డులోని ఎల్లాపూర్ రోడ్డు నుంచి హసన్‌పర్తి వరకు, నయీంనగర్, పబ్లిక్ గార్డెన్ మీదుగా హంటర్ రోడ్డు, కేఎంసీ వరకు సెంట్రల్ మీడియన్లలో మొక్కలకు నీటి సరఫరా, పెంపకం తీరు, సుందరీకరణను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొక్కలకు రోజూ నీరందించాలని సీఎంహెచ్ఓ మాధవరెడ్డిని ఆదేశించారు.

దిగుమతి చేయట్లేదని రైతుల ఆందోళన


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

ఖానాపురం: రైస్ మిల్లుల వద్దకు వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా మిల్లర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహిస్తూ రైతులు మండల కేంద్రం శివారులో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. రైస్‌మిల్ ఎదురుగా ట్రాక్టర్లను రోడ్డుకు అడ్డుగా పెట్టి మిల్లర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధాన్యాన్ని దిగుమతి చేసుకోకుండా తమను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి ఘటనా స్థలికి చేరుకుని రైతులతో మాట్లాడారు. మిల్లులో ధాన్యాన్ని దిగుమతులు చేయిస్తామని, రైతులు అధైర్యపడొద్దని సూచించారు. దీంతో ఆందోళన కార్యక్రమాన్ని రైతులు విరమించారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వ గోదాం వద్ద హమాలీలతో సొసైటీ సీఈఓ ఆంజనేయులు మాట్లాడారు. సంఖ్య పెంచుకోవాలని, దిగుమతులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని తెలిపారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్ దమనకాండను ఖండించాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాబు
- త్రిపుర ఘటనలపై ఫొటో ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న నాయకులు

నర్సంపేట: త్రిపుర ప్రజానీకంపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దమనకాండను ఖండించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబు అన్నారు. ఈమేరకు తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం త్రిపురలో జరిగిన ఘటనలను ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఇప్పటికైనా త్రిపురలో ప్రజలపై జరుగుతున్న దాడులను ఆపాలని, ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తండ్రిపై దాడికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్



తొర్రూరు: ఆస్తి కోసం తండ్రిపై కత్తితో దాడికి పాల్పడి పరారైన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన బుధవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సైలు గండ్రాతి సతీష్, లింగారెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం టీక్యా తండాకు చెందిన వృద్ధుడు మాలోతు రాములుపై కుమారుడు స్వామి ఈ నెల 28న తొర్రూరు బస్టాండ్‌లో కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈక్రమంలో బుధవారం నిందితుడిని పట్టుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. దాడికి వినియోగించిన కత్తి, బైక్ స్వాధీనం చేసుకున్నారు.

గేదెను ఢీకొట్టిన బైక్ - వ్యక్తి మృతి



నరేష్ (ఫైల్)

గార్ల(డోర్నకల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన చిల్కోడు – గొల్లచెర్ల క్రాస్‌రోడ్ మార్గమధ్యలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్ మండలం చిల్కోడు గ్రామానికి చెందిన తడక మల్ల నరేష్(32) గొల్లచెర్ల గ్రామంలో జేసీబీ నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో నరేష్ ద్విచక్రవాహనంపై చిల్కోడుకు వెళ్లి తిరిగి గొల్లచెర్లకు వస్తుండగా ఎస్సారెస్పీ కాలువ సమీపంలో చీకట్లో గేదెను ఢీకొట్టడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో నరేష్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, 14 నెలల కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

యువకుడి దుర్మరణం



రవీందర్ (ఫైల్)

తొర్రూరు రూరల్: వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం మానుకోట జిల్లా తొర్రూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన కనుకుంట్ల రవీందర్ (29) వ్యవసాయం, మత్స్యరంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. కాగా గ్రామ శివారులోని చేపల చెరువు వద్ద కాపలా ఉండేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో దంతాలపల్లి వైపు వస్తున్న బొలెరో వాహనం వెనకనుంచి బైక్‌పై ఉన్న యువకున్ని ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకోవడంతోపాటు వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉంచారు.

పదోన్నతుల సందడి!

- ఉమ్మడి వరంగల్ పోలీసుశాఖలో పలువురికి ప్రమోషన్
- త్వరలో డీఎస్పీలుగా తొమ్మిది మంది సీఐలు
- సీఐ పదోన్నతుల జాబితాలో 28 మంది ఎస్సైలు



సాక్షిప్రతినిధి, వరంగల్: పోలీసుశాఖలో పదోన్నతుల ప్రక్రియ మళ్లీ మొదలైంది. దీంతో వివిధ కేడర్లలో ఉన్న అధికారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న 1995 బ్యాచ్‌కు చెందిన మిగిలిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)లు.. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు(డీఎస్పీ)లుగా పదోన్నతి పొందనున్నారు. సుమారు రెండేళ్ల కిందట 1995 బ్యాచ్‌కు సంబంధించిన పదోన్నతుల జాబితా వెలువడే సమయంలో 1996 బ్యాచ్‌కు చెందిన కొందరు కోర్టుకు వెళ్లడం.. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని డీజీపీలను హైకోర్టు ఆదేశించడంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 150 మందికి బ్రేక్ పడింది. వరంగల్ జోన్‌కు సంబంధించిన ఆ జాబితాలో ఉన్న 38 మందికి త్వరలోనే డీఎస్పీలుగా పదోన్నతి కలగనుంది. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ)కి వెళ్లినట్లు తెలిసింది.

జాబితాలో ఎవరెవరు..

మల్టీజోన్ –2 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీపీ) షానవాజ్ ఖాసీం వారం రోజుల క్రితం ఆ జోన్‌లో పని చేస్తున్న 38 మంది మంది సీఐల పేర్లను డీఎస్పీ పదోన్నతుల కోసం సిఫారసు చేశారు. సీనియారిటీ ప్రకారం రూపొందించిన 38 మందిలో ఇద్దరు ఇప్పటికే మృతి చెందగా, మరో ఇద్దరు సర్వీసు నుంచి తొలగించబడ్డారు. మిగిలిన 34 మంది లిస్టులో ఎనిమిది మంది ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. ఇందులో కరీంనగర్ పీటీసీలో సీఐగా ఉన్న వరంగల్‌కు చెందిన జి.విజయపాల్ రెడ్డి, మహబూబాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జి.మోహన్, జయశంకర్ భూపాలపల్లిలో డీఎస్‌బీగా ఉన్న జాన్ నర్సింహులు ఉన్నారు. అదే విధంగా కె.రవీందర్ (పీటీసీ, వరంగల్), కె.జనార్దన్‌రెడ్డి (టాస్క్‌ఫోర్స్, వరంగల్), హనుమకొండ సీఐగా ఉన్న సీహెచ్ శ్రీనివాస్ జీ (ప్రస్తుతం సీఐడీ), కె.విజయ్‌కుమార్ (వీఆర్, వరంగల్), బి.భరత్ కుమార్ (డీఐజీ ఆఫీస్, వరంగల్), ఎల్.రమేష్ కుమార్ (సీసీఎస్, వరంగల్), సి.సతీష్‌బాబు (సీఎస్‌బీ, వరంగల్)లు ఈ జాబితాలో ఉన్నారు. మరో 28 మంది ఎస్‌ఐలకు కూడా సీఐలుగా పదోన్నతి కలిగే అవకాశం ఉంది.

త్వరలో పదోన్నతుల ఉత్తర్వులు..

సీఎం కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ మేరకు ఇంతకాలం పెండింగ్‌లో ఉన్న పోలీసుల పదోన్నతి ఫైలు చకచకా కదులుతోంది. ఐజీపీల రెకమండ్ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఫైనాన్షియల్ అప్రూవల్ కోసం జీఏడీ (జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్) వెళ్లి క్లియర్ అయినట్లు సమాచారం. ఏసీఆర్‌ల పెండింగ్‌పైన ఆరా తీసిన ఉన్నతాధికారులు అవినీతి నిరోధక శాఖ నుంచి క్లియరెన్స్ కోసం రాసినట్లు తెలిసింది. డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సిఫారసుతో పాటు 'లూప్‌లైన్' వివాదం నుంచి కూడా బయటపడాల్సిన అవసరం కూడా ఉంది. జీఓ 40 ప్రకారం ఒక అధికారి ప్రమోషన్‌కు ముందు.. తర్వాత కనీసం రెండు, మూడు సంవత్సరాలు లూప్‌లైన్‌లో పని చేయాల్సి ఉంది. ఈ నిబంధన సడలింపు కోసం కూడా ముఖ్యమంత్రికి పంపినట్లు సమాచారం. ఏదేమైన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పోలీస్‌శాఖలో ప్రమోషన్‌ల ప్రక్రియ వేగవంతం చేసిన ప్రభుత్వం త్వరలోనే ఈ పదోన్నతుల ఉత్తర్వులను జారీ చేయనున్నట్లు సమాచారం.

పదేళ్లలో వందేళ్ల ప్రగతి

- మంత్రి సత్యవతి రాథోడ్
- ఈఎంఆర్ఎస్ కామన్ ఎంట్రెన్స్ ఫలితాలను విడుదల చేసిన మంత్రి
- స్టేట్ ఫస్ట్, సెకండ్ ర్యాంక్‌లు సాధించిన మానుకోట విద్యార్థులు



ఫలితాల విడుదల అనంతరం మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

మహబూబాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన పదేళ్ల కాలంలో సీఎం కేసీఆర్ పాలనలో వందేళ్ల అభివృద్ధిని సాధించిందని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో 2023–24 విద్యాసంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన కామన్ ఎంట్రెన్స్ ఫలితాలను మంత్రి సత్యవతి రాథోడ్ బుధవారం మానుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాక ముందు 91 గురుకులాలు ఉంటే రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అన్ని వసతులతో 95 గురుకులను ఏర్పాటు చేసిందని సత్యవతి అన్నారు. ప్రవేశ పరీక్షకు 7,252 హాజరు కాగా.. మొదటి విడతలో 1,347 మంది విద్యార్థులకు మోటా అడ్మిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం 23 ఏకలవ్య పాఠశాలల్లో సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. మానుకోట జిల్లా నుంచి సుమారు 200 మంది విద్యార్థులు సీట్లు సాధించగా.. జిల్లాకు చెందిన కిరణ్ 90 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఉమేష్ స్టేట్ సెకండ్ ర్యాంక్ కైవసం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈనెల 1 నుంచి పదో తేదీలోపు కేటాయించిన పాఠశాలలో చేరాలని సూచించారు. సీబీఎస్ఈ విధానంలో విద్యాబోధన ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని 185 రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో 8,000మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. 332 ఆశ్రమ పాఠశాలలు ఉండగా 1,34,000 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. చదువు ప్రాధాన్యత తనకు తెలుసని మూడున్నర కిలోమీటర్లు పోలేక ఏడో తరగతి వరకు మాత్రమే తాను చదివానని అందుకు మానుకోట జిల్లా కేంద్రంలో బాలికల గురుకుల పాఠశాలను మంజూరు చేయించినట్లు చెప్పారు. ఇందుకోసం రూ.12 కోట్లు విడుదలయ్యాయని ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభం అవుతుందన్నారు. ఈనెల 24 నుంచి నాలుగు లక్షల ఎకరాలకు పోడు పట్టాల పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఐఏఎస్ స్టడీసెంటర్ లాంటిదే మానుకోట జిల్లాలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఏకలవ్య విద్యాలయాల ఓఎస్‌డీ స్వర్ణలత, డిప్యూటీ సెక్రెటరీ చంద్రశేఖర్, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, అకాడమిక్ ఓఎస్డీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మ విగ్రహం అతిప్రాచీనమైనది..



విగ్రహాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

గంగారం : మానుకోట జిల్లా గంగారం మండల కేంద్రంలోని వేల్పు జాతరలపై గత రెండు రోజులుగా బిర్స ముండా రీసెర్చ్ సెంటర్ బృందం పరిశోధనలు చేస్తోంది. ఇందులో భాగంగా గుట్టపై పురావస్తు గంగాలమ్మ విగ్రహం, కట్టడాలు ఉన్నాయని, జెజ్జరి, సిద్దబోయిన, యాప ఇంటిపేర్ల గల పెద్దమనుషులు చెప్పడంతో పరిశోధన బృందం అక్కడకు చేరుకుని పరిశీలించింది. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కాకతీయ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ గుట్టపై ఉన్న గంగాలమ్మ విగ్రహం అతి ప్రాచీనమైనది అని క్రీస్తు పూర్వం కోయ రాజ్యాలు ఆదివాసీలు కోల్పోయిన తర్వాత దట్టమైన అడవుల ప్రాంతానికి వలస వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటుచేసుకునే క్రమంలో తమ వెంట తెచ్చుకున్న విగ్రహమే ఈ గంగాలమ్మ విగ్రహం అన్నారు. ఈ గంగాలమ్మ పేరు మీదనే గంగారం అనే పేరు వచ్చిందని తెలిపారు. ఈ పురాతన విగ్రహంపై ఉన్న చిత్ర లిపిలో రాయి బండానీ వంశానికి చెందిన గుర్తులు, 5వ గట్టు అని తెలిపే 5 నిలువు గీతలు ఉన్నట్లు గుర్తించారు. అందుకే నేటికి కూడా 5వ గట్టు జెజ్జరి వారే ఈ దేవున్ని కొలుస్తున్నారు. గంగాలమ్మ 5వ గట్టు వారి కోడలు అని మేడారం సమ్మక్కకి తల్లి అని వివరాలు ఈ విగ్రహంపై చిత్ర లిపిలో ఉందన్నారు. దొన గుట్టకి గంగారం గ్రామానికి తూర్పు దిక్కున కొండపైన ఒక దొన (పెద్ద రంధ్రం) ఉంటుందని, ఆ దోనలో గంగాలమ్మ ఉండి చల్లని గాలి వీస్తుందని నమ్మకం. కొమురం జ్యోతిష్, సిద్దబోయిన జజ్జరి, కాక శ్వేత, నవ్య, పాయం నందిని తదితరులు పాల్గొన్నారు.

ఎద్దును ఢీకొట్టిన ఆటో

- ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు
- కూలీ పని చేసి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. ఘటన



నర్సయ్య(ఫైల్)

కురవి: ఎదురుగా అడ్డుగా వచ్చిన ఎద్దును ఆటో ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడిన ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చింతపల్లి గ్రామ శివారు పెద్దలాల్ తండా వద్ద 365 జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. సీరోలు ఎస్సై ఎల్.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం ... ఖమ్మం జిల్లా తిర్మాలాయపాలెం మండలం మహ్మదాపురం(మాందాపురం) గ్రామానికి చెందిన కూలీలు అంగడి నర్సయ్య(40), అతని భార్య మంజుల, జినుక ఉప్పలయ్య, జినుక వెంకన్న, గొల్లపల్లి సత్యం అదే గ్రామానికి చెందిన ఆటోను(ఆటో డ్రైవర్ గార్ల భిక్షపతి) తీసుకుని సీరోలు మండలం కొత్తూరు (సీ) గ్రామంలో పిల్లర్ల గుంతలు తీసేందుకు కూలీ పనికి వచ్చారు. పని ముగించుకుని రాత్రి ఇంటికి వెళ్తున్న క్రమంలో చింతపల్లి శివారు పెద్దలాల్ తండా వద్దకు చేరుకోగానే ఆటో ఎదురుగా వచ్చిన ఎద్దును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ గార్ల భిక్షపతి, ఆటోలో ప్రయాణిస్తున్న అంగడి నర్సయ్య(40), మంజుల, జినుక ఉప్పలయ్య, వెంకన్న, గొల్లపల్లి సత్యంలకు తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్స్‌లో మహబూబాబాద్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరుకోగానే నర్సయ్య మృతి చెందాడు. ఎస్సై నరేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్సై నరేష్ తెలిపారు.

స్వరాష్ట్రంలోనూ ఓరుగల్లుపై వివక్ష

- అభివృద్ధిపై చర్చా గోష్టిలో పలువురు వక్తల అభిప్రాయం



చర్చాగోష్టిలో పాల్గొన్న సంఘాల నాయకులు

హన్మకొండ: తెలంగాణలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా తీవ్ర వివక్షకు గురవుతుందని వక్తలు అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆధ్యక్షతన ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై చర్చా గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్, ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ తిరుణహరి శేషు, ప్రజా, వృత్తి సంఘాల నాయకులు సోమ రామ్మూర్తి, డాక్టర్ వీరస్వామి, శివరాత్రి దుర్గయ్య, నరోత్తం రెడ్డి, ఈశ్వర్ సింగ్, సాయిని నరేందర్ శశికాంత్‌తోపాటు పలువురు ప్రసంగించారు. స్వరాష్ట్రంలో ఉమ్మడి జిల్లా అన్ని రంగాల్లో నష్టపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో నాయకత్వం రాజకీయ చైతన్యాన్ని కోల్పోయి విద్యా, వైద్యం, పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల రాబట్టడం, అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. నేతలు తమ పదవులు కాపాడుకోవడానికి, బాసు భజన చేయడానికే పరిమితమయ్యారని విమర్శించారు. నిత్యం కేంద్రంతో తగవులాడుతూ వరంగల్‌కు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీని రాకుండా చేశారన్నారు. స్మార్ట్ సిటీ నిధులు ఉపయోగించుకోలేకపోయారని పేర్కొన్నారు. ఏటూరు నాగారం కమలాపూర్ రేయాన్స్ ఫ్యాక్టరీని తెలంగాణ ప్రభుత్వమే మూసివేసిందని ఆరోపించారు. రైతుల భూములను కారు చౌకగా స్వాధీనం చేసుకొని ఏర్పాటు చేస్తానన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కు ఈ నాటికి ఒక్క స్థానికుడికి కూడా ఉద్యోగం కల్పించలేకపోయిందని వాపోయారు. సూరత్, బొంబాయి, భీవండి నుంచి తిరిగి వచ్చిన వలస కార్మికులు మడికొండ టెక్స్‌టైల్స్ పార్కులో సొంత ఖర్చులతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సాయం అందించలేదన్నారు. జనగామ, కొడకండ్ల, పాలకుర్తి, మహబూబాబాద్‌లో టెక్స్ టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తామని ఉత్తరప్రగల్భాలు పలికిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంతవరకు ఏం సాధించారని ప్రశ్నించారు. వరంగల్ నగరాన్ని డల్లాస్ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఉమ్మడి వరంగల్ జిల్లాను కల్లాస్ చేశారని ధ్వజమెత్తారు. 70 ఎకరాల జైలు ప్రాంగణాన్ని భవనాలను కూలగొట్టి, ఆ భూములను రూ.11 వేల కోట్లకు మహారాష్ట్ర బ్యాంకుకు తాకట్టు పెట్టారని తెలిపారు. జైలు భూములను కూడా అమ్ముకోవడానికి ప్రణాళిక సిద్ధం చేసే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ టైర్ రిట్రీడింగ్ సెంటర్ స్థలాన్ని అధికార పార్టీ నాయకులు తీసుకొని వ్యాపారానికి ఉపయోగించుకోవాలని చూస్తున్నారన్నారు. జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో మెడికల్ కాలేజీలకు స్థలాలు, కనీస సౌకర్యాలు లేక బోర్డు మాత్రమే ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయ క్షేత్రమైన వరంగల్ జిల్లాను విత్తనాల హబ్‌గా చేస్తానని ప్రకటించిన సీఎం కేసీఆర్ ఇప్పటికీ ఆ దిశలో పావలా పెట్టుబడి కూడా పెట్టలేదని విమర్శించారు. నాయకులకు మాత్రం వ్యాపారాలు, కాంట్రాక్టులు, ఫామ్ హౌస్‌లు, వందల ఎకరాల ఎస్టేట్లు, కోటి రూపాయల విలువ గల వాహనాలు, కోట్ల రూపాయల విలువైన భవనాలు నిర్మించుకున్నారని, సామాన్య ప్రజల ప్రగతిని పట్టించుకోలేదని తూర్పారబట్టారు. డోర్నకల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, పాలకుర్తి నియోజకవర్గాలను రాష్ట్రంలో అట్టడుగున ఉన్న ప్రాంతాలుగా కేంద్రం గుర్తిస్తే, రాజకీయ విభేదాలు సృష్టిస్తూ కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

సమస్యలు పరిష్కరించాలి



శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఇస్తారి

కేయూ క్యాంపస్: రెండేళ్లుగా కాకతీయ యూనివర్సిటీలోని అధ్యాపకుల సమస్యలు పెరిగిపోయాయని సమస్యలను పరిష్కరించటంలేదని వర్సిటీ అధికారులు విఫలమయ్యారని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి అన్నారు. బుధవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్‌రావును కలిసి పలు సమస్యలపై ప్రస్తావిస్తూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మామిడాల ఇస్తారి మాట్లాడుతూ.. అధ్యాపకులకు రావాల్సిన ఏరియర్స్ నాలుగునెలల్లో ఇస్తామని చెప్పి ఏడాదైనా చెల్లించటంలేదన్నారు. నిలిపివేసిన క్యాస్ పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులపై వీసీ .రిజిస్ట్రార్లు కక్షపూరిత చర్యలకుపాల్పడుతున్నారని ఆరోపించారు. న్యాక్‌కు పంపిన సెల్ఫ్‌స్టడీ రిపోర్టు (ఎస్ఎస్ఆర్)లో తప్పుడు సమాచారాన్ని పొందుపర్చటం సిగ్గుచేటన్నారు. ఎస్ఎస్ఆర్‌లో తప్పుడు సమాచారం పొందుపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై త్వరలోనే గవర్నర్‌ను కలుస్తామని చెప్పారు. వివిధ విభాగాల అధిపతులకు సమాచారం లేకుండా అడ్జెంట్ ఆచార్యులను నియమించడం సరికాదన్నారు. వారి నియామకాల్లో నిబంధనలను పాటించలేదని ఆరోపించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

భార్య కాపురానికి రావడంలేదని..

- మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య
- పురుగుల మందు డబ్బాతో సెల్ఫీ వీడియో..



పురుగుల మందు డబ్బాతో అశోక్(ఫైల్)

కేసముద్రం: భార్యాకాపురానికి రాకపోవడంతోపాటు, అత్తింటివారు దూషించడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. తన భార్యను ఉద్దేశిస్తూ.. నీపైన నాకు ప్రేమ ఉంది.. నాపైన నీకు ప్రేమ ఉంటే చచ్చేముందన్న రావాలంటూ.. సెల్ఫీ వీడియో తీస్తూ పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధర్మారంతండా జీపీ శివారు వెంక్యాతండాలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి.. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం జీపీ శివారు వెంక్యాతండాకు చెందిన బానోతు అశోక్(24), మహబూబాబాద్ మండలంలోని ముత్యాలమ్మతండాకు చెందిన బేబిని ఏడాది క్రితం పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో బేబి గర్భవతి కావడంతో పుట్టింటికి వెళ్లింది. నాలుగు నెలల క్రితం కొడుకు పుట్టాడు. కాగా అప్పటికే భార్యభర్తల మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈక్రమంలో భార్యను కాపురానికి తీసుకురావడం కోసం 5రోజుల క్రితం అశోక్ తన అత్తగారింటికి వెళ్లాడు. దీంతో భార్య బేబి, అత్త వాంకుడోతు సత్రి, మామ ఆనంద్, తోటి అల్లుడు నరేష్, వదిన రజిత కలిసి అశోక్‌ను దూషించడంతో ఇంటికి వచ్చిన అనంతరం మే 28న ఇంట్లో పురుగులమందు డబ్బాతో సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈక్రమంలో మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. బుధవారం మానుకోట ఏరియా ఆస్పిత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశోక్ భార్య, అత్త, మామ, తోటి అల్లుడు, వదినలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కేసముద్రం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని శివారు కిష్టాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జల్లంపల్లి అశోక్(49) కొద్దిరోజులుగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అతడు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించడంతో రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా మృతుడి కుమారుడు ధనుంజయ్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బయ్యారంలో వివాహిత..

కాటారం: కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడగా బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బయ్యారం గ్రామానికి చెందిన చినాల స్వప్న(28) గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. స్థానికంగా వైద్యం చేయించినప్పటికీ ఫలితం లేదు. కడుపు నొప్పి తీవ్రతరం కావడంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే స్వప్న మృతి చెంది ఉన్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త వంశీ, ఇద్దరు కుమారులు వైశ్విక్, రుష్విక్ ఉన్నారు. మృతురాలి సోదరుడు సాయిశివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

- భార్యపై అనుమానంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు



భార్య అక్షరతో శ్రీకాంత్ (ఫైల్)

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని నెల్లుట్లకు చెందిన తాండ్ర శ్రీకాంత్ (30) బుధవారం తెల్లవారు జామున నెల్లుట్ల శివారు ఆర్టీసీ కాలనీలో అద్దెకు ఉంటున్న ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. నెల్లుట్లకు చెందిన తాండ్ర శ్రీకాంత్‌కు పాలకుర్తి మండలం బమ్మెరకు చెందిన నందిని అలియాస్ అక్షరతో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. శ్రీకాంత్‌కు నలుగురు అన్నదమ్ములు కావడంతో ఇల్లు సరిపోక కొద్ది రోజులు అద్దె ఇళ్లలో ఉన్నాడు. భార్యభర్తలు ఇద్దరు తరచుగా గొడవ పడడంతో అక్షర మూడు నెలల క్రితం తల్లిదండ్రులు ఉంటున్న హైదరాబాద్ అంబర్‌పేటకు వెళ్లింది. అక్కడే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో భార్యభర్తలు ఇద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. 15 రోజుల క్రితమే అత్తగారింటికి వచ్చిన అక్షర నెల్లుట్ల సమీపంలోని ఆర్టీసీ కాలనీలో భర్తతో అద్దె ఇంట్లో ఉంటున్నారు. బుధవారం భర్త శ్రీకాంత్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు అక్షర అతని కుటుంబ సభ్యులకు తెలియజేయగా బంధువులు, అన్నదమ్ములు అక్కడికి వెళ్లగా మంచం సమీపంలో నేలపై పడుకొని చనిపోయి ఉన్నాడు. ఉరి వేసుకున్నాడని చెబుతున్నప్పటికీ, మృతదేహం నేల మీద ఎందుకు ఉందని బంధువులు ప్రశ్నించగా నేనే ఉరితాడు కోసేశానని చెప్పుతూ ఇంట్లో టీవీ చూస్తూ పాటలు వింటుండడంతో మరింత అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రవీణ్ సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి భార్య అక్షరను పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్షర తల్లి, బంధువులు కారులో సాయంత్రం నాలుగున్నర గంటలకు నేరుగా పోలీసుస్టేషన్‌కు చేరుకోగానే అక్కడే ఉన్న బంధువులు.. శ్రీకాంత్ చనిపోయిన విషయం ఉదయం ఏడుగంటలకు తెలిస్తే సాయంత్రం నాలుగు గంటలకు వస్తారా అంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు అడ్డుకోవడంతో బంధువులతో వాగ్వాదం నెలకొంది. అప్పుడే పోలీసేస్టేషన్‌కు చేరుకున్న ఎస్సై ప్రవీణ్ అందరిని స్టేషన్ బయటకు పంపించి మృతుడు శ్రీకాంత్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ నూతన కమిటీ



నినాదాలు చేస్తున్న జేఏసీ బాధ్యులు, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల రాష్ట్రస్థాయి సదస్సు అనంతరం మంగళవారం రాత్రి జేఏసీ కమిటీని ప్రకటించారు. చైర్మన్‌గా డాక్టర్ ఏ.పరుశరామ్(ఉస్మానియా యూనివర్సిటీ), కన్వీనర్‌గా డాక్టర్ పి.కరుణాకర్‌రావు (కాకతీయ యూనివర్సిటీ), కో చైర్మన్‌గా డాక్టర్ వేల్పుల కుమారస్వామి(ఉస్మానియాయూనివర్సిటీ)ని ఎన్నుకున్నారు. ఇంకా వివిధ యూనివర్సిటీల నుంచి సుమారు 25మందిని ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. కాగా, కేయూలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని, హనుమకొండలో సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చాలని, అందుకు రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సదస్సులో తీర్మానించినట్లు బుధవారం తెలంగాణా యూనివర్సిటీస్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జేఏసీ కన్వీనర్ డాక్టర్ కరుణాకర్‌రావు తెలిపారు. ఈ సదస్సులో దర్మతేజ, సతీష్, లింగయ్య, సూర్యం, కనకయ్య, చిర్ర రాజు, వెంకటగోపినాథ్, దత్తహరి, చింత శ్యామ్, యశ్వంత్‌రావు, వెంకటేష్, సురేష్‌నాయక్, ఆనంద్, రాజేశ్వరి, సాదు రాజేష్, వినిత పాండె, ఉపేందర్ పాల్గొన్నారు.